## అవైస్‌కు కాంస్యం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రాజస్థాన్ వేదికగా జరిగిన 34వ జాతీయ సీనియర్ వుషు టోర్నీలో తెలంగాణకు చెందిన మహమ్మద్ అవైస్ కాంస్య పతకంతో మెరిశాడు. శుక్రవారం జరిగిన సీనియర్ విభాగంలో బరిలోకి దిగిన నిజామాబాద్ ప్లేయర్ అవైస్ అద్భుత ప్రదర్శన కనబరుస్తూ మూడో స్థానంలో నిలిచాడు. గత కొన్నేండ్లుగా నిజామాబాద్‌లో కోచ్ అబ్దుల్ ఒమర్ దగ్గర శిక్షణ తీసుకుంటున్న అవైస్.. జాతీయ స్థాయి టోర్నీలో ఆకట్టుకున్నాడు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు అతన్ని అభినందించారు.

## రసవత్తరంగా గాలె టెస్టు

గాలె: శ్రీలంక, బంగ్లాదేశ్ మధ్య గాలె వేదికగా జరుగుతున్న తొలి టెస్టు రసవత్తరంగా సాగుతున్నది. తొలి ఇన్నింగ్స్‌లో లంకేయులు.. 485 పరుగులకు ఆలౌట్ కాగా పర్యాటక బంగ్లాకు 10 పరుగుల స్వల్ప ఆధిక్యం దక్కింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లా.. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసింది. షద్మన్ ఇస్లాం (76) అర్ధ శతకంతో మెరవగా తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరోలు కెప్టెన్ నజ్ముల్ (56*), ముష్ఫీకర్ (22*) క్రీజులో ఉన్నారు.

## హైదరాబాద్ హీరోస్ హ్యాట్రిక్

• రగ్బీ ప్రీమియర్ లీగ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: జీఎంఆర్ రగ్బీ ప్రీమియర్ లీగ్(ఆర్‌పీఎల్) తొలి సీజన్‌లో హైదరాబాద్ హీరోస్ హ్యాట్రిక్ విజయంతో అదరగొట్టింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 43-12 తేడాతో కళింగ బ్లాక్‌టైగర్స్‌పై ఘన విజయం సాధించింది. దీంతో వరుసగా మూడో విజయాన్ని ఖాతాలో వేసుకున్న హీరోస్.. పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతున్నది. పూర్తి ఏకపక్షంగా సాగిన ఈ పోరులో హీరోస్ ఏడు ట్రైలను సాధించింది. జట్టులో ఆరుగురు ప్లేయర్లు ట్రైలు చేసి తమ సత్తాచాటారు. జోజి నాసోవా రెండు ట్రైలతో అద్భుత ప్రదర్శన కనబర్చగా, టెరియో తమాని నాలుగు ట్రైలను గోల్‌గా మలిచి జట్టుకు 8 పాయింట్లను అందించాడు. మ్యాచ్‌లో తొలుత కళింగ ఆధిపత్యం ప్రదర్శించినా.. ఆ తర్వాత పుంజుకున్న హైదరాబాద్ వరుస పాయింట్లతో జోరు కనబరిచింది. కీలకమైన ద్వితీయార్ధంలో అదే దూకుడుతో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది.

## భారత్‌కు తొమ్మిది పతకాలు

సింగపూర్: ఆసియా ఆర్చరీ కప్ స్టేజ్-2లో భారత్‌కు తొమ్మిది పతకాలు దక్కాయి. వేర్వేరు టీమ్‌విభాగాల్లో ఐదు జట్లు ఫైనల్ పోరుకు అర్హత సాధించినా అన్నింట్లో భారత్ రెండో స్థానంలో నిలిచి రజత పతకాలతో సరిపెట్టుకుంది. టోర్నీలో మొత్తంగా భారత ఆర్చర్లు రెండు స్వర్ణాలు సహా, ఆరు రజతాలు, ఒక కాంస్యం ఖాతాలో వేసుకున్నారు. భారత ఆర్చర్లు తమ కంటే తక్కువ సీడ్ ప్లేయర్ల చేతిలో ఓటమిపాలై రజత పతకాలకు పరిమిత మయ్యారు. పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో విష్ణుచౌదరి, పారాస్ హుడా, జుయెల్ సర్కార్‌తో కూడిన భారత త్రయం 0-6తో జపాన్ చేతిలో ఓడింది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో చౌదరీ, వైష్ణవి పవార్ జోడీ 32-35తో ఇండోనేషియాపై ఓడి రజతంతో సంతృప్తిపడింది. మరోవైపు పురుషుల కాంపౌండ్ ఫైనల్లో కుశాల్‌దలాల్ 149-143తో జోషువా మనాన్ (ఆస్ట్రేలియా) పై గెలిచి పసిడితో మెరిశాడు. మహిళల విభాగంలో తేజల్ సాల్వే 146-144తో భారత్‌కే చెందిన షణ్ముకినాగ సాయిపై గెలిచి స్వర్ణం సొంతం చేసుకుంది.

## సెంథిల్‌కుమార్‌కు కాంస్యం

కౌలాలంపూర్: మలేషియా వేదికగా జరుగుతున్న ఏషియన్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో భారత యువ ప్లేయర్ వెలావన్ సెంథిల్‌కుమార్ కాంస్య పతకంతో మెరిశాడు. శుక్రవారం జరిగిన పురుషుల వ్యక్తిగత సెమీఫైనల్ పోరులో 9-11, 11-13, 11-5, 6-11తో టాప్‌సీడ్ లు జు క్వాన్(హాంకాంగ్) చేతిలో ఓటమిపాలయ్యాడు. 65 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన పోరులో సెంథిల్ ప్రత్యర్థికి దీటైన పోటీనివ్వడంలో విఫలమయ్యాడు.

## మహిళల క్రికెట్‌లో అనుమతివ్వండి..

• ఐసీసీ, బీసీసీఐకి అనయ బంగర్ లేఖ

లండన్: మహిళల క్రికెట్‌లో ఆడేందుకు తనకు అనుమతి ఇవ్వాలని అనయ బంగర్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు హార్మోన్ రిప్లేస్‌మెంట్ థెరపీ(హెచ్‌ఆర్‌టీ) నివేదికను పొందుపరుస్తూ ఎనిమిది పేజీలతో కూడిన లేఖను ఐసీసీతో పాటు బీసీసీఐకి పంపింది. ట్రాన్స్‌జెండర్లకు మద్దతుగా నిలువాల్సిందిగా అనయ సోషల్‌మీడియాలో పోస్ట్ చేసిన తన లేఖలో ప్రముఖంగా ప్రస్తావించింది. 2021లో అబ్బాయి నుంచి అమ్మాయిగా మారిన 24 ఏండ్ల అనయ మాట్లాడుతూ 'జాతీయ జట్టుకు తిరిగి ఆడాలనుకుంటున్నాను. దేశానికి ఆడాలన్న తపన నాలో అప్పుడు ఎలా ఏందో ఇప్పటికీ అలాగే ఉంది. కలను సాకారం చేసుకునేందుకు అన్ని రకాలుగా ప్రయత్నం చేస్తూనే ఉన్నాను. ఏదో ఒక రోజు తండ్రి సంజయ్ బంగర్ నాకు మద్దతుగా నిలుస్తాడన్న నమ్మకం నాకుంది' అని లేఖలో పేర్కొంది. 2023 వన్డే ప్రపంచకప్ సమయంలో క్రికెట్‌లో ట్రాన్స్‌జెండర్ల ప్రాతినిధ్యంపై ఐసీసీ నిషేధం విధించిన విషయం విదితమే.

# శతక ధమూకా

### సెంచరీలతో రెచ్చిపోయిన గిల్, జైస్వాల్

### రాణించిన పంత్, రాహుల్

### భారీ స్కోరు దిశగా భారత్

### మొదటి రోజు 359/3

**5** టెస్టులలో సారథిగా తొలి మ్యాచ్‌లోనే సెంచరీ చేసినవారిలో గవాస్కర్, హజారే, వెంగ్‌సర్కార్, కోహ్లీ తర్వాత గిల్‌ఐదో స్థానంలో నిలిచాడు.

గిల్ (127*)

జైస్వాల్ (101)

**ఎన్నో అనుమానాలు! అంతకుమించిన సందేహాలు! కోహ్లీ, రోహిత్, అశ్విన్ వంటి దిగ్గజాల నిష్క్రమణ వేళ కఠినమైన ఇంగ్లండ్ పిచ్‌లపై అంతగా అనుభవం లేని టీమ్‌ఇండియా ఎలా ఆడబోతుందోనని..! కానీ తొలిటెస్టు మొదటిరోజే ఆ అనుమానాలన్నింటినీ పటాపంచలు చేస్తూ లీడ్స్ టెస్టులో యువ భారత్ అదరగొట్టింది. సారథ్య బాధ్యతలు అందుకున్న అరంగేట్ర టెస్టులోనే బ్యాటుతో శుభ్‌మన్ గిల్ అజేయ శతకంతో సత్తాచాటగా.. క్రీజులో కుదురుకుంటే మూడంకెల స్కోరు సాధించిగానీ పోరాటాన్ని ఆపని యోధుడు యశస్వీ జైస్వాల్ సెంచరీకి తోడు వైస్ కెప్టెన్ రిషభ్ పంత్ అర్ధ శతకంతో భారత్ భారీ స్కోరు దిశగా సాగుతున్నది.**

హెడింగ్లే: భారత టెస్టు జట్టు కొత్త సారథి శుభ్‌మన్ గిల్ (175 బంతుల్లో 127 నాటౌట్, 16 ఫోర్లు, 1 సిక్స్), యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (159 బంతుల్లో 101, 16 ఫోర్లు, 1 సిక్స్) శతక్కొట్టడంతో హెడింగ్లీలో ఇంగ్లండ్‌తో మొదలైన తొలి టెస్టులో భారత్ మొదటి రోజే భారీ స్కోరు చేసింది. లీడ్స్ వేదికగా శుక్రవారం మొదలైన టెస్టులో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేస్తున్న భారత్.. తొలి రోజు ఆట ముగిసే సమయానికి 85 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 359 పరుగులు చేసి పటిష్ట స్థితిలో నిలిచింది. గిల్, జైస్వాల్ శతకాలకు తోడు రిషభ్ పంత్ (102 బంతుల్లో 65, 6 ఫోర్లు, 2 సిక్సర్లు), కేఎల్ రాహుల్ (78 బంతుల్లో 42, 8 ఫోర్లు) రాణించడంతో తొలి రోజు మూడు సెషన్లలో భారత్ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. రెండో రోజూ ఇదే ఆటను కొనసాగిస్తే మ్యాచ్‌పై గిల్ సేనకు పట్టుచిక్కినట్టే! ఇక బౌలింగ్‌లో అనుభవలేమితో ఇంగ్లండ్ పేసర్లు తొలిరోజు పూర్తిగా తేలిపోయారు. స్టోక్స్ (2/43) మినహా మిగిలిన పేసర్లు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు.

**5** ఇంగ్లండ్‌లో తొలి టెస్టు ఆడుతూ శతకం చేసిన ఐదో భారత బ్యాటర్ జైస్వాల్. అతడికంటే ముందు సందీప్ పాటిల్, గంగూలీ, విజయ్ మంజ్రేకర్, మురళీ విజయ్ ఉన్నారు.

### ఆరంభమే అదుర్స్

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్‌కు తాము ఎంత తప్పు చేశామో తెలియడానికి పెద్దగా సమయం పట్టలేదు. అండర్సన్, స్టువర్ట్ బ్రాడ్ లేని లోటు ఆ జట్టులో.. స్పష్టంగా కనబడింది. సీనియర్ పేసర్ క్రిస్ వోక్స్‌తో పాటు బ్రైడన్ కార్స్, జోష్ టంగ్ తేలిపోవడంతో భారత ఓపెనర్లు స్వేచ్ఛగా బ్యాటింగ్ చేసి అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. బౌండరీతో పరుగుల వేటను ఆరంభించిన జైస్వాల్, రాహుల్ ఇంగ్లిష్ పేసర్లను సమర్థవంతంగా ఎదుర్కున్నారు. పూర్తిగా ఆఫ్‌సైడ్ ఆటతో అలరించిన ఈ ద్వయం 16 బౌండరీలు కొడితే.. అందులో అన్నీ ఆఫ్‌సైడ్‌లో ఆడినవే కావడం విశేషం. స్టోక్స్ బౌలింగ్‌లో రాహుల్.. బ్యాక్ టు బ్యాక్ బౌండరీలతో అలరించాడు. కానీ సాఫీగా సాగుతున్న భారత ఇన్నింగ్స్‌లో లంచ్‌కు ముందు డబుల్ షాక్ తాకింది. కార్స్ వేసిన 25వ ఓవర్లో రాహుల్.. ఆఫ్ స్టంప్‌కు ఆవలగా వెళ్తున్న బంతిని వెంటాడి ఫస్ట్ స్లిప్స్‌లో జో రూట్ చేతికి చిక్కాడు. ఆ తర్వాత ఓవర్‌లో స్టోక్స్ వేసిన పక్కా ప్రణాళికతో సాయి సుదర్శన్ అరంగేట్ర టెస్టు అతడికి నిరాశను మిగిల్చింది.

### జైస్వాల్, గిల్ జోరు

92/2తో భోజన విరామానికి వెళ్లొచ్చిన భారత్.. ఆ తర్వాత జోరు పెంచింది. కెప్టెన్ గిల్ ఆరంభంలో వన్డే తరహా ఆట ఆడాడు. వోక్స్ బౌలింగ్‌లో మూడు బౌండరీలు రాబట్టాడు. 96 బంతుల్లో జైస్వాల్ ఫిఫ్టీ పూర్తయింది. గిల్ అండతో జైస్వాల్ కూడా దూకుడు పెంచాడు. వోక్స్ 38వ ఓవర్లో 3 ఫోర్లు బాదిన అతడు.. టంగ్ ఓవర్లో డీప్ పాయింట్ మీదుగా సిక్సర్ బాదాడు. గిల్ కూడా టంగ్ ఓవర్లో బౌండరీతో 55 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తిచేశాడు. టెస్టులలో అతడికి ఇదే ఫాస్టెస్ట్ (బంతులపరంగా) హాఫ్ సెంచరీ. కార్స్ 48వ ఓవర్లో తొలి బంతిని బౌండరీగా మలిచి 90లలోకి వచ్చిన జైస్వాల్.. అదే ఓవర్లో 4, 5 బంతులనూ ఫోర్లు కొట్టాడు. ఆరో బంతికి సింగిల్ తీసి తన కెరీర్‌లో ఐదో శతకం నమోదుచేశాడు. అయితే టీ విరామానికి వెళ్లొచ్చాక స్టోక్స్ వేసిన రెండో ఓవర్లో జైస్వాల్ బౌల్డ్ అవడంతో 129 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది.

### రాకుమారుడి తొలి ముద్ర

జైస్వాల్ నిష్క్రమించే సమయానికి ఆటపై పూర్తి పట్టు సాధించిన గిల్.. పంత్‌తో కలిసి స్కోరుబోర్డును నడిపించాడు. ఇన్నింగ్స్‌కు ఇరుసైన నాలుగో స్థానంలో పరిస్థితులకు తగ్గట్టుగా ఆడుతూ శతకం దిశగా సాగాడు. ఫిఫ్టీ తర్వాత కాస్త నెమ్మదించిన గిల్.. పంత్‌తో స్టైక్ రొటేట్ చేసి ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించాడు. బషీర్ బౌలింగ్‌లో పంత్ ఫోర్, సిక్సర్‌తో భారత్ 300 పరుగుల మార్కును అందుకుంది. 98 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద టంగ్ బౌలింగ్‌లో ఆఫ్‌సైడ్ బౌండరీ బాదిన గిల్.. సారథిగా తొలి టెస్టులోనే బ్యాట్‌తో తన ముద్రను ఘనంగా వేశాడు. టెస్టుల్లో అతడికి ఇది ఆరో శతకం. పంత్ తన సహజశైలికి భిన్నంగా సంయమనంతో ఆడటం గమనార్హం. అజేయమైన నాలుగో వికెట్‌కు గిల్-పంత్ ద్వయం ఇప్పటికే 130 పరుగులు జోడించింది.

**1** ఇంగ్లండ్‌తో వారిగడ్డపై టెస్టులు ఆడుతూ మొదటి రోజు ఆటలో భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు. 2022లో ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో 338/7 చేసింది. మొత్తంగా శ్రీలంక (2017లో శ్రీలంకపై 399/3), సౌతాఫ్రికా (2001లో 372/1) తర్వాత విదేశీ గడ్డపై థర్డ్ హయ్యస్ట్ స్కోరు.

### సంక్షిప్త స్కోర్లు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** 85 ఓవర్లలో 359/3 (గిల్ 127*, జైస్వాల్ 101, స్టోక్స్ 2/43, కార్స్ 1/70)

### అయ్యో సాయి

జూన్ 20.. భారత క్రికెట్ దిగ్గజాలుగా వెలుగొందుతున్న సౌరవ్ గంగూలీ, రాహుల్ ద్రావిడ్, విరాట్ కోహ్లీకి ఈ తేదీ ఎంతో ప్రత్యేకం. దాదా, ద్రావిడ్ 1996లో ఇదే రోజు ఇంగ్లండ్‌పై అరంగేట్రం చేయగా కోహ్లీ సైతం 2011 జూన్ 20న వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో టెస్టులకు ఎంట్రీ ఇచ్చాడు. దిగ్గజాలు టెస్టు అరంగేట్రం చేసిన రోజే సాయి సుదర్శన్ కూడా టెస్టులలో తొలి అవకాశం అందుకున్నా అదృష్టం మాత్రం అతడిని వెక్కిరించింది. మొదటి టెస్టులో గంగూలీ సెంచరీ చేయగా ద్రావిడ్ 95 రన్స్ చేశాడు. కోహ్లీ 19 పరుగులు చేయగా.. సాయి డకౌట్ అయ్యాడు.

## ఉత్సాహంగా ఒలింపిక్ రన్

ఒలింపిక్ రన్‌లో పాల్గొన్న సీపీ సాయిచైతన్య, ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు

కంఠేశ్వర్, జూన్ 20 : రాష్ట్ర ఒలింపిక్ సంఘం ఆదేశాల మేరకు జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఒలింపిక్ రన్‌ను శుక్రవారం నిర్వహించారు. నగరంలోని ఆర్ఆర్ చౌరస్తా నుంచి కలెక్టర్ గ్రౌండ్ వరకు రన్ కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీ సాయిచైతన్య హాజరై, ఒలింపిక్ టార్చ్, జెండాను ఊపి రన్‌ను ప్రారంభించారు. సీపీ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమని, ఏదైనా ఒక క్రీడను ఎంచుకుని అందులో ఉన్నతస్థాయికి ఎదిగేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు రాములు, ఈగ సంజీవ్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశవేణు, సభ్యులు, నగర ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్‌అలీ, ట్రాఫిక్ సీఐ ప్రసాద్, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 13 మందిపై కేసు

• ముగ్గురికి జైలు శిక్ష

వినాయక్‌నగర్, జూన్ 20 : పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ పర్యవేక్షణలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ట్రాఫిక్ సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 13 మందిపై కేసు నమోదు చేశారు. వారికి ట్రాఫిక్ సీఐ శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించి, మార్నింగ్ కోర్టులో హాజరుపర్చారు. పంచాల రాజ్ కుమార్‌కు మూడు రోజులు, అబ్దుల్ చాంద్, మహబూబ్‌కు రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ తీర్పు చెప్పారు. మిగగా 13 మంది వాహనదారులకు రూ.18 వేలు జరిమానా విధించారు.

## ఎస్సారెస్పీకి 1690 క్యూసెక్కుల వరద

మోర్తాడ్, జూన్ 20: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి శుక్రవారం 1690 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80,5టీఎంసీలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1063.30 అడుగులు (13.978టీఎంసీలు) నీటినిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి మొత్తం అవుట్‌ఫ్లో 599 క్యూసెక్కులు కాగా కాకతీయకాలువకు 100 క్యూసెక్కుల నీటిని, మిషన్‌భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని వదులుతుండగా, 268 క్యూసెక్కుల నీరు ఆవిరిరూపంలో వెళ్తున్నది. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 2.267 టీఎంసీల ఇన్‌ఫ్లో రాగా, 1.076 టీఎంసీల అవుట్‌ఫ్లో అయినట్లు అధికారులు తెలిపారు.

## దురలవాట్లకు దూరంగా ఉండాలి

మానవహారంగా ఏర్పడి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

మోర్తాడ్, జూన్ 20: యువత దురలవాట్లకు దూరంగా ఉండాలని ఉపాధ్యాయులు సూచించారు. కమ్మర్‌పల్లి మండలం ఉప్పూర్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో, మోర్తాడ్ ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ వ్యతిరేక దినం సందర్భంగా శుక్రవారం విద్యార్థులతో మానవహారం నిర్మించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులకు డ్రగ్స్ వినియోగంతో కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమాల్లో పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్వేనంబర్ లాక్.. 'భరోసా' బ్లాక్

- నష్టపోతున్న కమ్మర్‌పల్లి రైతులు
- ఇప్పటివరకూ అందని రైతుభరోసా
- పట్టించుకోని సంబంధిత అధికారులు

మోర్తాడ్, జూన్ 20 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రైతు భరోసా' అన్నదాతలకు ఎలాంటి భరోసా ఇవ్వడంలేదు. రైతులందరికీ రైతుభరోసా అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా.. బాల్కొండ నియోజకవర్గంలో ఇప్పటికీ పెట్టుబడి సాయం అందక కొందరు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏడాదికి రెండుసార్లు రైతుబంధు వచ్చేది. ఎప్పుడు కూడా రైతుబంధు రావడంలో ఇబ్బందులు కలగలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతుభరోసా చాలా మంది రైతులకు రావడం లేదు. ఎందుకని ఆరా తీసిన రైతులకు వారి భూమి ఉన్న సర్వేనంబర్‌ను బ్లాక్ చేశారని తెలిసింది. దీంతో 'మేమేం పాపం చేశామని, మా భూములు ఉన్న సర్వేనంబర్‌ను ఎందుకు బ్లాక్ చేశారని, సన్నచిన్నకారు రైతులమీద అధికారులకెందుకంత కోపం..' అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఏడాదికాలంగా మొరపెట్టుకుంటున్నా పట్టించుకోని అధికారులు

కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని 386 సర్వేనంబర్‌లో దాదాపు 40 మంది రైతులు భూములు సాగు చేసుకుంటున్నారు. వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రైతుభరోసా రాలేదు. రైతుభరోసా ప్రారంభించగానే తమకెందుకు రాలేదని అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ పైనుంచి లాక్ చేయబడి ఉన్నదని మండలస్థాయి అధికారులు చెప్పడంతో రైతులు విస్తుపోయారు. అధికారులు వచ్చి రైతుల సాగు చేసుకుంటున్న క్షేత్రాలను సందర్శించి, ఫొటోలు సైతం తీసుకున్నారు. పండిస్తున్న పంటల వివరాలనూ నమోదు చేసుకున్నారు. అందరికీ వచ్చినట్లు తమకు రైతుభరోసా రాకపోవడంతో ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఏడాదికాలంగా అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడంలేదని మండిపడుతున్నారు. రెండోసారి రైతుభరోసా వస్తుందని తెలిసి అధికారుల వద్దకు వెళ్లినా మళ్లీ అదే సమాధానం వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుభరోసా వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

## కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఠంచన్‌గా వస్తుండే..

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఠంచన్‌గా రైతుబంధు వచ్చింది. రైతుబంధు పథకాన్ని ప్రారంభించినప్పటి నుంచి ఏటా రెండుసార్లు వచ్చింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మాకు రైతుబంధు వస్తలేదు. దీనిపై అధికారులెవరినీ అడిగినా పట్టించుకుంటలేరు. సర్వే నంబర్ లాక్ చేశారని చెబుతున్నరు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతుబంధు ఎలా వచ్చింది..ఇప్పుడెందుకు రాకుంట చేశారని అడిగితే పైనే లాక్ చేశారని సమాధానం చెబుతున్నరు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మాకు రైతుభరోసా వచ్చేలా చూడాలి.

- నల్లూరి రమేశ్, కమ్మర్‌పల్లి

## 'నషా ముక్త్ భారత్ అభియాన్' విజయవంతం చేయాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

కంఠేశ్వర్, జూన్ 20 : మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా జిల్లాలో ఈనెల 20 నుంచి 26 వరకు నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించనున్నామని, విజయవంతం చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో వారం రోజులపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సమన్వయ సమావేశం నిర్వహించి, కార్యక్రమాల నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అధికారులు సమన్వయంతో పని చేస్తూ నిజామాబాద్‌ను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం గోడపత్రులను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా సంక్షేమాధికారిణి రసూల్ బీ, అదనపు డీసీపీ బస్వారెడ్డి, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో నిజామాబాద్ జోన్ డీఎస్పీ సోమనాథం, డీఎంహెచ్‌వో రాజశ్రీ, డీఏఈవో రవికుమార్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

జక్రాన్‌పల్లి, జూన్ 20 : మండలంలోని మునిపల్లిలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈనెల 23న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అనూష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ (ఎంపీసీ/ఎంపీసీఎస్), బీఎస్సీ (ఎంఎస్‌సిఎస్/ ఎంఎస్‌డిఎస్), బీజెడ్‌సీ, ఎన్‌జడ్‌సీ, బీకాం(బీఏ/సీఏ), బీఏ(ఈపీహెచ్, ఈపీపీ) కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు ఉంటాయని తెలిపారు. అడ్మిషన్లకు హాజరయ్యే విద్యార్థినులు తమ ఎస్సెస్సీ, ఇంటర్ మెమో, టీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 15 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు జిరాక్స్, ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు మూడు జిరాక్స్ సెట్లతో, 23న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల్లోపు కళాశాలలో హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9948192406, 9542748057, 9666352860 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

## డిగ్రీ అడ్మిషన్లకు ఈనెల 25 చివరి గడువు

ఖలీల్‌వాడి, జూన్ 20 : డిగ్రీ అడ్మిషన్ల కోసం రాష్ట్ర ఉన్నత విద్యామండలి గడువు పెంచి ఈనెల 25 తేదీ వరకు చివరి అవకాశం కల్పించిందని గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సైదా జైనెబ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న గిరిజన విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డుతో కళాశాలలో ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఎంపీసీఎస్, ఎంఎస్‌సీఎస్‌లో పరిమిత సంఖ్యలో సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

## మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

• జిల్లా వ్యవసాయశాఖ అధికారి వీరస్వామి

నాగేపూర్ శివారులో వరి నాట్లను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి వీరస్వామి

నవీపేట, జూన్ 20: రైతులు పంటలకు మోతాదుకు మించి రసాయన ఎరువులను వాడవద్దని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వీరస్వామి సూచించారు. మండల కేంద్రంలో పురుగుల మందుల దుకాణాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందులకు స్టాక్, ధరలను బోర్డుపై రాసి ఉంచాలని, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసే రైతులకు రసీదులు ఇవ్వాలని సూచించారు. అనంతరం నాగేపూర్ శివారులో క్షేత్ర స్థాయిలో వరి నాట్లను పరిశీలించారు. వరినాట్లు వేస్తున్న తరుణంలో మొదటి దశలో మాత్రమే కాంప్లెక్స్ ఎరువులను వాడాలని అన్నారు. రెండో దశలో యూరియా, మూడో దశలో పొటాష్ ఎరువులను వాడాలని సూచించారు. కలుపు మందులను 15 నుంచి 24 రోజుల లోపల వేయాలని సూచించారు. ఆయన వెంట ఏవో నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## భార్య మృతికి కారణమైన భర్తకు పదేండ్ల కఠిన జైలు శిక్ష

వినాయక్‌నగర్, జూన్ 20 : వరకట్నం వేధింపులతో భార్య మృతికి కారణమైన భర్తకు పదేండ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి శుక్రవారం తీర్పు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ధర్పల్లి రాజేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ గ్రామంలోని ఇస్లాంపుర కాలనీకి చెందిన షేక్ ఇద్రిస్ వివాహం.. నడిపల్లి గ్రామానికి చెందిన ఫాజియా బేగంతో జరిగింది.